
మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

# భూ సేకరణ పూర్తయితేనే ప్రాజెక్టుల పనులు వేగవంతం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శివ కుమార్ నాయుడు

**గద్వాల మార్చి 12,ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల పనులు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని ఆర్ అండ్ ఆర్ (రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్) కమిషనర్ శివకుమార్ నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ పై గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో ఇంకా 541 ఎకరాల భూ సేకరణ నోటిఫికేషన్, సర్వేస్థాయిలో ఉందని, ప్రక్రియ పూర్తి చేస్తే ప్రభుత్వం నిర్వాసితులకు సత్వరమే డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు కు రిజర్వాయర్ నిర్మాణానికి ఇంకా 212 ఎకరాలు, గట్టు కుడి, ఎడమ కాలువలకు 249 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఆర్డీఎస్ పరిధిలో మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి 567 ఎకరాల భూమి సేకరించాల్సి ఉన్నందున రైతులకు గ్రామ సభలు నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. ఆయా ప్రాజెక్టుల భూసేకరణ పూర్తయితేనే నిర్మాణాల పనులు వేగవంతమై, సంబంధిత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, పిజెపి సిఈ నాగేంద్రం, ఎస్ఈ రహీముద్దీన్, ఈ.ఈ.శ్రీనివాస్, సర్వే ఏడి నూకరాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, చిత్రంలో ఎమ్మెల్యేలు తుడిమేగారెడ్డి, జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్

## ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

**రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**వనపర్తి ప్రతినిధి,మార్చ్ 12 ప్రభాతవార్త:** జిల్లాలో ప్రజల చేత నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచులు, పట్టణాల్లో కౌన్సిలర్లు ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేసి, వారి మెప్పు పొందాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.గురువారం స్థానిక కళ్యాణ సాయి గార్డెన్స్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంకు మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు. మంత్రి తో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల -మిగతా2లో..

## ప్రజా పాలనలో భాగస్వాములు కావాలి

**విజయవంతం చేసేందుకు సహకారం అందించాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా..**

**సర్పంచ్‌లు, కౌన్సిలర్ లు, కార్పొరేటర్, మున్సిపల్ చైర్మన్‌లు,మేయర్‌లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమం విజయవంతం**

**జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్న ఎస్.పి. జానకి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి,మేయర్ జి.మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి**


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లి ప్రజా సమస్యలు పరిష్కారం చేసేందుకు రాష్ట ముఖ్యమంత్రి ప్రజా పాలన ప్రగతి పాలన 99 రోజుల కార్యక్రమం ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అనంత మారుతి గార్డెన్,పంక్షన్ హాల్‌లో సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్, మున్సిపల్ చైర్మన్ లు,మేయర్ లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6నుండి జూన్ 12వరకు 99 రోజుల పాటు పది అంశాలతో షెడ్యూల్ ప్రకారం నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్‌లు, చైర్మన్‌లకు పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టం ప్రకారం విధులు,బాధ్యతలు, అధికారాలుపై శిక్షణ లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాలు, వార్డులు , కార్పొరేషన్ డివిజన్ల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడానికి మంచి అవకాశం లభించిందన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఏమి చేయాలి, ఏమి చేయకూడదు అనే విషయాలను తెలుసుకునే మంచి అవకాశం ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కలుగుతుందని చెప్పారు.ఇటీవల ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఆమె అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రారంభించిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీ, వార్డు, డివిజన్‌లో పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు.ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులు గ్రామాల పాలన బాధ్యతలను చేపట్టారని, అధికారంతో పాటు బాధ్యతలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి కృషి చేసి వారికి నమ్మకం కల్పించాలని సూచించారు.అలాగే పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా పొందాలో మార్గనిర్దేశం చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామాల అభివృద్ధి కోసం రూపొందించి వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఆమె తెలిపారు.కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, పరిశుభ్రత, ప్రజారోగ్యం, పేదల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అదేవిధంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించడం, స్థానిక పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచడం, విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రచారం నిర్వహించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. మండలం లో ఎం.పి.డి.ఓ లు,గ్రామంలో – మిగతా4లో..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్, మేయర్ మమత , డిప్యూటి మేయర్ సురెందర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి



మాట్లాడుతున్న మంత్రి శ్రీహరి

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా**

## గ్రామాలకు దిశా నిర్దేశం

**సర్పంచ్ పదవి ఎంతో కీలకం మంత్రి వాకిటి శ్రీహరి**

**నారాయణ పేట, మార్చి 12 ప్రభాతవార్త :** నారాయణపేటజిల్లా లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి దిశా నిర్దేశం జరుగుతుందని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రజాప్రతినిధులు పారదర్శకంగా,బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పేటలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 272 మంది సర్పంచులు, 72 మంది కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ పదవి ఎంతో కీలకమని, గ్రామాభివృద్ధిలో వారి పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు. పుట్టిన,మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేసే సర్పంచ్, మున్సిపల్ చైర్మన్ పదవులు చాలా బాధ్యతాయుతమైనవన్నారు. తాను కూడా సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని గుర్తుచేశారు మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం – మిగతా2లో..

## ప్రజా పాలనతో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి

**-రాష్ట ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త:** ప్రజా పాలనలో నాగర్ కర్నూల్ జిల్లా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగంగా జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేసి, నాగర్ కర్నూలు జిల్లాకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజాపాలనను ఆదర్శంగా నిలపాలని మంత్రి ప్రజా ప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు.గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక నాగర్ కర్నూల్ జిల్లా మున్సిపల్ వార్డు కౌన్సిలర్ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధుల అవగాహన సదస్సును రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక,సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్


ప్రజా పాలన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి వర్యులు

చంద్ర, అదనపు కలెక్టర్ రెవిన్యూ అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ దేవ సహాయం, నాగర్కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల తదితర ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు విధానం, ప్రజలకు అందించాల్సిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ అవగాహన సదస్సులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పది అంశాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులకు ఇదొక మంచి అవకాశంగా తీసుకొని గుర్తింపు వచ్చేలా పని చేయాలని మంత్రి తెలిపారు.వార్డులు, గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు ఉదయం 6 గంటలకు మార్నింగ్ నిర్వహించి ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలు పది అంశాల వారీగా నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరే విధంగా ప్రజాప్రతినిధులు అధికారులు సమనన్వయంతో పని చేయాలని ఈ కార్యక్రమాన్ని ఆశామాషిగా తీసుకోవద్దని మంత్రి తెలిపారు. ప్రస్తుతం చోటుచేసుకుంటున్న అకాల మరణాల్లో సగం మంది రోడ్డు ప్రమాదాల కారణంగా చనిపోతున్నారని ఇది అత్యంత బాధాకరమైన విషయమని, ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాలు అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజల ఆరోగ్యాలతో పాటు ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధిలపై ఉందని ఆయన అన్నారు. కళ్యాణం లక్ష్మీ, షాదీ ముబారక్ పథకానికి సంబంధించిన పెళ్లయిన వారం రోజులకే ఆన్లైన్లో నమోదు చేసేలా కృషి చేయాలని, 20 రోజుల్లోనే మంజూరు అయ్యేలా -మిగతా4లో..

**బావిలో దూకి ఇద్దరు కూతుళ్లతో**

## సహా తల్లి ఆత్మహత్య

**- వెల్కిచర్లలో ఘటన.. కుటుంబ కలహాలే కారణమంటున్న స్థానికులు పోలీసులు..**


వెల్కిచర్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన తల్లీకూతుళ్లు

**భూత్పూర్,మార్చి 12,ప్రభాతవార్త :** భార్యా-భర్తల తగవులు, కుటుంబ కలహాల కారణంగా ఓ కుటుంబంలోని ఇద్దరు కూతుళ్లు,తల్లీ ముగ్గురూ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. – మిగతా2లో..


నూతన బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

## కడవరకు కాంగ్రెస్‌తోనే

**పార్టీ లైన్ తప్పే ప్రసక్తే లేదు ..**

**పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు**

**కాంగ్రెస్ పార్టీ వనపర్తి మండల, పట్టణ కమిటీ ఏర్పాటు**

**సమావేశంలో శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ జెండా కిందనే కడవరకు పని పనిచేయాలని, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గురువారం పట్టణంలోని RG గార్డెన్స్ లో నిర్వహించిన వనపర్తి మండల, పట్టణ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన దీదిది అధ్యక్షులు శివసేనరెడ్డి , ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి నుంచి మరో 15 సంవత్సరాల వరకు కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంటుందని ప్రతిపక్షాలకు ఎలాంటి తావులేదు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయిపోయిందని అన్నారు.ప్రతి ఒక్కరం భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చేసేంతవరకు -మిగతా4లో..

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో**

## ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

**గద్వాల మార్చి 12, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నూతన కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్‌లు, అదనపు కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళలు పెద్ద ఎత్తున సర్పంచులుగా, కౌన్సిలర్లుగా గెలుపొందడం శుభ పరిణామమని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. 99 రోజులపాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ఇందులో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు కీలకంగా ఉండాల్సినందున వారికి సమగ్రంగా అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏమైనా సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్స్, అధికారులు నివృత్తి చేస్తారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో బాల్యవివాహాలతో పాటు పలు సామాజిక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కూడా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడిబాట నిర్వహించడం జరుగుతుందని,బాలికలు చదువులు మధ్యలోనే ఆపివేయకుండా ఉన్నత విద్యాభ్యాసం చేసేలా ప్రోత్సహించాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన జిల్లా అక్షరాస్యతలో చివరి స్థానంలో ఉందని త్వరలో మరోసారి జనాభా గణన చేపడుతున్నందున జిల్లాలో అక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. న్యూట్రిషన్ సమస్యల నివారణకు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా సర్పంచులు, కౌన్సిలర్లు తమ పరిధిలోని కేంద్రాలను ప్రతి బుధవారం పర్యవేక్షణ చేయాల్సిందిగా కోరారు. పోలీస్ శాఖ తరపున డ్రగ్స్,రహదారి భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.వ్యవసాయంలో రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే భూములు సారవంతత కోల్పోయి భవిష్యత్తు తరాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నందున అన్నదాతలు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారించేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజనకు ఎంపికవ్వడంతో వ్యవసాయ రంగంతోపాటు అనుబంధ రంగాల్లోని లబ్ధిదారులందరూ ఆర్థికంగా – మిగతా3లో..


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

**74 పాఠశాలల్లో**

## ఏఐ అమలు..

**రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ముందంజ**

**ఎఫ్ఎల్ఎన్, ఎఎక్స్,ఎల్ ఏఐ కార్యక్రమంలో డీఈవో ప్రవీణ్ కుమార్**

**మహబూబ్‌నగర్, మార్చి 12 ప్రభాతవార్త:** ఏఐ అమలులో రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ ముందంజలో ఉందని డిఈఓ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ ఎ,ఎక్స్,ఎల్.ఎ.ఐ ఆధారితంగా ఎంపిక చేయబడిన 74పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం డైట్ కళాశాల,మహబూబ్‌నగర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపికైన పాఠశాలలోని 50 శాతం మంది ఉపాధ్యాయులకు ఈశిక్షణ అందించారు. మిగతా 50 శాతం మంది ఉపాధ్యాయులకు నేడు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ హాజరై ఉద్దేశించి మాట్లాడుతూ సుమారు – మిగతా3లో..



జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

# పదవులు కాదు..మనం చేసే అభివృద్ధే శాశ్వతం

- ఇప్పటి వరకు 1100ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- క్రీడా, పాడి పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, మార్చి12 ప్రభాతవార్త:** మక్తల్ తహసిల్దార్ కార్యాలయంలో రంజాన్ తోఫా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతమన్నారు. ఇప్పటివరకు మక్తల్ నియోజకవర్గంలో దాదాపు 1100ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు మంత్రి తెలియజేశారు.ప్రజా ప్రభుత్వం వచ్చాక మక్తల్‌లో ఇప్పటివరకు ఎనిమిదిసార్లు ఈ చెక్కులను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. పేదింటి ఆడపిల్లల పెళ్లి చేసిన తల్లిదండ్రులకు సరైన సమయంలో చెక్కులను ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి ఆర్థికంగా ఆసరా దొరుకుతుందని తెలిపారు.ఈ దసరాలోపు మక్తల్‌లో 150 పడకల ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.హామ్ టెండర్ ద్వారా రూ.210 కోట్లతో మక్తల్ నారాయణపేట రోడ్డును నాలుగు లేన్‌ల రహదారిగా మారుస్తున్నామని వెల్లడించారు.రూ.230 కోట్లతో గోలపల్లి వద్ద ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. మక్తల్ చెరువును సుందరీకరణ చేసి త్వరలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. 25 కోట్ల తో మక్తల్ నడిబొడ్డున అన్నిహంగులతో అధునాతన స్టేడియాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెడతానన్నారు మంత్రి శ్రీహరి. ఇప్పటి వరకు దాదాపు 1100 కోట్ల నిధులు మక్తల్ అభివృద్ధి కి తీసుకొచ్చామని తెలియజేశారు.పదవులు కాదు శాశ్వతం మనం చేసిన అభివృద్ధి పనులు శాశ్వతం అని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే అని, ఎన్నికల తర్వాత ధ్యాస మొత్తం అభివృద్ధి పైనే ఉండాలన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు.ప్రతీ పేదవాడికి నెలకు6కిలోల సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, మహిళా సంఘాలకు వడ్డీ లేని ఋణాలు లాంటి పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. మేము గెలవగానే అధికారం నెత్తికి ఎక్కించుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నా దగ్గరుండే 5 శాఖలకు సంబంధించి 510 కోట్లు బడ్జెట్ కేటాయించగా ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చాక 6200 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.ప్రజా ప్రతినిధులు గా ఎన్నికైన మమ్మలను ప్రశ్నించే అధికారం ప్రజలకు ఉండాలన్నారు. మీరు ప్రశ్నించకపోతే అభివృద్ధిలో వెనకబడి పోతారన్నారు. మీరు ప్రశ్నించకపోతే అభివృద్ధిలో వెనకబడి పోతారన్నారు.మీ అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చే బాధ్యత మాదని తేల్చి చెప్పారు. పుట్టిన గడ్డకు ఋణం తీర్చుకునే అవకాశం దొరికినందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. గతంలో మహిళలకు చీరలు ఇస్తే చేలల్లో అడవి జంతువులు రాకుండా కట్టడానికి ఉపయోగపడేవన్నారు. ఇప్పుడు పేదవాడు కూడా పండగలను ఘనంగా జరుపుకోవాలని ప్రభుత్వం నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఇక్కడి ప్రాంత ప్రజలు కుల మతాలకతీతంగా అన్నదమ్ములలాగ కలిసి జీవించే సంస్కృతి ఉందన్నారు. మక్తల్‌లో రాబోయే ఎన్నికల్లో ప్రోగ్రెస్ కార్డు చూపించే ఓట్లు అడుగుతామని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో మక్తల్ రూపు రేఖలు మారుస్తానని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్,పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్, కౌన్సిలర్లు, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి,మక్తల్ తహసీల్దార్ సతీష్ కుమార్, కౌన్సిలర్లు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాలను అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న పోతులమడుగు జెడ్పీహెచ్ఎస్ టెన్త్ విద్యార్థులు

**భూత్పూర్, మార్చి 12, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం పోతులమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యనభ్యసించిన 28మంది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారికి హాల్‌టికెట్లతో పాటు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, స్టీలు వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలను విడిచి పోతున్న 28మంది టెన్త్ విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల జీహెచ్‌ఎం ఉషారాణి ఇతర ఉపాధ్యాయులు నిరంజన్, ఆహ్మద్, గజానంద్, సాయిరాం, సేవ్య, రాము, మాధవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. పరీక్షలు వత్తిడులకు లోనుకాకుండా పరీక్షలు మంచిగా రాసి మంచి మార్కులు సాధించాలని టెన్త్ విద్యార్థులకు జీహెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు సూచించారు.

**దేవరకద్ర, మార్చి12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం, గురకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందర్నీ ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమనాథ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి, మంచి ఫలితాలు సాధించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడులు, అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సోమనాథ్, ఉపాధ్యాయులు ఎండి నజీర్ పాషా, పద్మ, మేరోలిన్, రమేష్, పవన్ కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు

**నారాయణపేట, మార్చి12 ప్రభాతవార్త:** నారాయణ జిల్లా కేంద్రంలో శ్రీహంసవాహిని పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి పాఠాలు బోధించారు కలెక్టర్‌గా నందిని, డీఈవోగా నవిత, ఎంఈఓగా అరవింద్, ప్రిన్సిపల్‌గా ఎల్లప్ప, వైస్ ప్రిన్సిపల్‌గా శిరీషలు బాధ్యతలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషిస్తూ చక్కగా విద్యాబోధన చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, రాజేష్ కుమార్ మాట్లాడుతూ అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా పనిచేసిన అనుభవాలను వివరించారు చివరగా చక్కటి విద్యాబోధన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్, ఉపాధ్యాయులు నమ్రత, విజయ, అమల, షమీనా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన డిసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి

**గద్వాల మార్చి12, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రిజ్వాన్ బాషా షేక్‌ని గద్వాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాజీవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, గద్వాల జిల్లాకు హృదయపూర్వక స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందాల్సిన సేవలపై విస్తృతంగా చర్చించారు.

## శ్రీశైలం పాదయాత్ర భక్తులకు వైద్య సదుపాయం

**అయిజ మార్చి12, ప్రభాతవార్త:** కర్ణాటక మరియు మహారాష్ట్రల నుండి శ్రీశైల దైవదర్శనానికి వేలాదిగా తరలి వెళ్తున్న శ్రీశైలం పాదయాత్ర భక్తులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు కలగకుండా మండల పరిధిలోని వెంకటపురం స్టేజిలో పి.హెచ్.సి వైద్య అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంహెచ్ఈఓ ఓబులేష్ ఆదేశాలతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ద్వారా భక్తుల ఏవైనా అనారోగ్య సమస్యలు మందులు ఆయింట్మెంట్లు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్టు వారు తెలిపారు. ఎండ తీవ్రతను బట్టి ఎవరైనా నీరసంగా ఉన్నట్లయితే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి సరైన వైద్య సలహాలు ఇస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు నాగేంద్రమ్మ, రాజేశ్వరి, సుజాత, వనిత, మరియు గ్రామస్తులు కే రాజు, సి రఘు, పాల్గొన్నారు.

## గంగాపూర్ ఆలయానికి 2 ఏసీలు వితరణ

**జడ్చర్ల, మార్చి 12 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని గంగాపూర్ లక్ష్మీ చెన్నకేశ్వర స్వామి ఆలయానికి రెండు ఎయిర్ కండిషన్లు అందజేసినట్లు ఆలయ ఈవో రెడ్డి తెలిపారు. కార్పొరేషన్ సోషల్ సర్వీస్‌లో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ షీలా 2ఏసీ లను సర్పంచ్ గిరిప్రసాద్, ఈవో సమక్షంలో అందజేసినట్లు తెలిపారు.

## యువకునికి గాయాలు..

### ఆసుపత్రికి తరలించిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్న చింతకుంట, మార్చి 12 ప్రభాతవార్త :** మండలంలోని చిన్న వడ్డేమాన్ సమీపంలోని వంతెన మలుపు వద్ద తన తన వాహన వేగాన్ని అదుపు చేసే క్రమంలో అదుపుతప్పి యువకుడికి రక్త గాయాలు అయ్యాయి. అటుగా వివిధ కార్యక్రమాలకై వెళ్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ తన వాహనాన్ని దిగి రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన యువకుని వద్దకు వెళ్లి పోలీసులకు సూచనలు ఇస్తూ పోలీసు వాహనంలో దగ్గరుండి ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలకై 108 అంబులెన్స్ లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని దగ్గరుండి ఆసుపత్రికి తరలించడంపై పలువురు ఎమ్మెల్యేను ప్రశంసిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన బొయ అంజి దేవరకద్రకు వెళ్తూ చిన్న వడ్డేమాన్ వంతెన మలుపు వద్ద వాహనం అదుపు తప్పికింద పడిపోయాడు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ప్రమాద స్థలి వద్ద వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## కేంద్రీయ విశ్వవిద్యాలయం తెచ్చిన ఘనత బిజెపిదే

- బిజెపి జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ

**వనపర్తి, మార్చి 12 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే సొంత మండలానికి రోడ్డు వేసుకోలేని పరిస్థితి ఉందని అని వనపర్తి జిల్లాకు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెచ్చిన ఘనత బిజెపి దేనని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. గురువారం బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని విద్యార్థిని ,విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ నూతన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని అందులో భాగంగానే వనపర్తి జిల్లా నాగవరం శివారులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు జరగనుందని ఆయన వివరించారు. నూతన భవన నిర్మాణం జరిగే వరకు రాజపేట శివారులోనియూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటిసి) 2026, 27 అకాడమిక్ ప్రారంభం కానున్నదని బాలవికాస వన్ త్రీ, 15సింగిల్ సెక్షన్లు అకాడమిక్ ప్రారంభం తర్వాత ప్రతి సంవత్సరం అప్ గ్రేడ్ ఉంటుందని తెలియజేస్తూ బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు ఎనలేని కృషి ఫలితంగా కేంద్రీయ విద్యాలయం మంజూరు జరిగిందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మేఘారెడ్డి అన్ని తామే చేశానని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం నిర్వహించు కోవడం సరికాదన్నారు. కేంద్రీయ విద్యాలయానికై గత పార్లమెంటు సభ్యులు కొట్లాడినప్పుడుమీరు కేవలం ఎంపీటీసీగా ఉన్న విషయం గుర్తు చేసుకోవాలని ,ఏ రోజు కూడా కేంద్రీయ విద్యాలయం కొరకు ఒక్క అడుగు కూడా వేయని మెఘా రెడ్డి మంజూరైన విద్యాలయానికి తానే హక్కుదారుడినని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేంద్రీయ విద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చింది, కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చింది. భవిష్యత్తులో నూతన బిల్డింగుకు, విద్యావసరాలకు ఏ ప్రభుత్వం నిధులు ఇస్తుందో పూర్తి వివరాలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బిజెపి డిమాండ్ చేస్తుందని మూడేళ్లయిన సొంత మండలానికిబీటి రోడ్డు వేసుకోలేని శాసనసభ్యులు నియోజకవర్గానికి1000 కోట్ల నిధులు తెచ్చారంటే నమ్మడానికి వనపర్తి ప్రజలు అమాయకులు కాదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు జిల్లా ఉపాధ్యక్షులు భాషెట్టి శ్రీనివాసులు ఎస్సీ మోర్చా మాజీ జిల్లాఅధ్యక్షులు ఆగపోగు కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

## పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులకు కొండంత అండ

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి
- మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**దామరగిద్ద, మార్చి 12 ప్రభాతవార్త :** పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి అన్నారు. దామరగిద్ద మండలంలో పనిచేస్తూ పీఆర్టీయూ టీఎస్ క్రియాశీలక కార్యకర్తలుగా ఉన్న సమయంలో అకాల మరణం చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.అశోక్ కుమార్ కుటుంబానికి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మొగల్‌మడక ప్రధానోపాధ్యాయులు శంకర్ నాయక్ కుటుంబానికి పీఆర్టీయూ సంఘం సంక్షేమ నిధి నుండి ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను ఎంఆర్సీ భవనంలో అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం గత 54 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తూ ముఖ్యమంత్రుల ద్వారా అనేక జీవోలు తీసుకువచ్చిందన్నారు. అనుకోని ప్రమాదాలు లేదా సాధారణ మరణాలు సంభవించిన సంఘ కార్యకర్తల కుటుంబాలకు సంఘం తరపున లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలపరిష్కారం, సంక్షేమం, భద్రత, పాఠశాలల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. మండల విద్యాధికారి ఎస్. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయులకు వచ్చిన అనేక జీవోలు పీఆర్టీయూ సంఘం ద్వారా సాధ్యమయ్యాయనిఅన్నారు. చెక్కులను అందుకున్న జిహెచ్ఎం సతీమణి ఎం. నిర్మల, పీఎస్ హెచ్ఎం కుమార్తె అనిత మాట్లాడుతూ కుటుంబ సభ్యులు మరణించిన తర్వాత కూడా సంఘంఈ విధంగా సహాయం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల జిహెచ్ఎం సురేష్, దామరగిద్ద మండల అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, నారాయణపేట మండల అధ్యక్షులు టి.ఎస్. రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులుశంభులింగం, తిప్పన్న, ప్రకాష్, మోహన్‌రెడ్డి, విజయ్ కుమార్, ఉసెనప్ప, సత్య నారాయణ, విజయలక్ష్మి, నరేష్, సక్సెనా, నాగేందర్, రత్నయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబసభ్యులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

## కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి

- డా.బి.ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. సుకన్య

**జడ్చర్ల, మార్చి 12 ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్ ఆర్ ప్రభుత్వ కళాశాల జడ్చర్లలో టిఎస్‌కే సి వారి ఆధ్వర్యంలో నిర్మాన్ అనే ఎన్జీవో సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసుకున్న పరస్పర ఒప్పంద పత్రం ఆధారంగా కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అందరికీ కమ్యూనికేషన్ స్కిల్స్, రెసుమె ప్రిపరేషన్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్ స్కిల్స్ పై మూడు రోజుల శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ॥ జి సుకన్య మార్గదర్శకత్వం లో ఏర్పాటు చేయబడిన ఈ మూడు రోజుల శిక్షణా తరగతులకు సయ్యద్ అజరుద్దీన్ నిర్మాన్ సంస్థ వారి నుండి శిక్షకుడిగా వ్యవహరించారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు వెర్బల్ కమ్యూనికేషన్, నాన్ వెర్బల్ కమ్యూనికేషన్ స్కిల్స్ అంటే ఏమిటో తెలుసుకున్నారు. రెసుమె ప్రిపరేషన్‌లో ఉండవలసిన ముఖ్యమైన అంశాలు, విద్యార్హతలు, ఉద్యోగ అనుభవము తదితర అంశాల పైన ఏ విధంగా పట్టు సాధించాలో వివరించారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ పై పట్టు సాధించి ఉండడం వల్ల ఉపాధి సాధన సులభతరమవుతుందని శిక్షకుడు అసరుద్దీన్ అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమం ఆధారంగా భవిష్యత్తులో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించబోతున్నారని అత్యధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని మల్టీ నేషనల్ కంపెనీస్‌లో ఉద్యోగాలను సాధిస్తారని టీఎస్‌కేసి కోఆర్డినేటర్ డా.నాగలక్ష్మి అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ తరగతులకు టిఎస్‌కేసి మెంటర్ వీర ప్రతాప్, ఇతర అధ్యాపకబృందం పాల్గొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకుని శిక్షణా తరగతులకు హాజరయ్యి కెరీర్ డెవలప్మెంట్‌కు సంబంధించిన సామర్థ్యాలను అభ్యసించారు.



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సయ్యద్ అజరుద్దీన్

## కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో యుఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని టిఎస్ యూటిఎఫ్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశల పోరాటాలలో భాగంగా గురువారం కేజీబీవీ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బాల్‌రాజ్ మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్ సమగ్ర శిక్షఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 29 రోజుల సమ్మె కాలానికి వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని, మినిమం టైం స్కేలు వర్తింపజేయలన్నారు. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ మంజూరు చేస్తూ, నైట్ డ్యూటీలను మినహాయింపు చేసి కేర్ టేకర్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ నాయకత్వంలో జరగబోయే జిల్లాస్థాయిరాష్ట్రస్థాయి పోరాటాలను నిర్వహిస్తుందని, సిబ్బంది, ఉద్యోగులందరు తమ సమస్యల పరిష్కారం కోసంపోరాటంలోకి రావాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆనంద్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు, సిబ్బంది సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ

**ఆత్మకూర్ మార్చి 12, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఆత్మకూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రోజు ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు ఎల్కూరి వేణుగోపాల్‌మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్యాడ్లు పంపిణీ చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కార్యనిర్వహక సభ్యులు సూరంపల్లి రమేష్, నర్సింలు, వెంకటేష్ తదితరులతో పాటుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు నేడు చివరి రోజు

**నారాయణ పేట, మార్చి12 ప్రభాతవార్త:** నారాయణపేట నాలుగో తరగతి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఈరోజు చివరి రోజు కావడంతో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను నమోదు చేయించాలని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, కోచులకు జిల్లా యువజన క్రీడా అధికారి (డీవైఎస్ఓ) నారాయణ పేట విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13 నుంచి 17 వరకు మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో కనీసం 20 మంది బాలురు, 20 మంది బాలికలు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని, వారిలో నుంచి 10 మంది బాలురు, 10 మందిబాలికలను ఎంఈఓలాగిన్ ద్వారా జిల్లా స్థాయికి పంపించాల్సి ఉంటుందని వివరించారు. మండల స్థాయిలో అవసరమైన సంఖ్య నమోదుకాకపోతే, అటువంటి విద్యార్థులను నేరుగా జిల్లా స్థాయి ఎంపికలకు పంపిస్తారని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు 31న నారాయణపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

## 74 పాఠశాలల్లో ఏఐ అమలు..

(మొదటి పేజీ తరువాయి)

74 పాఠశాలల్లో ఎఫ్ఎల్, ఎన్ఎ, ఎక్స్ఎల్ఎఐ కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. ఇతర జిల్లాల్లో ఇది తక్కువ సంఖ్యలో మాత్రమే అమలవుతుందని, జిల్లాలో ఈ కార్యక్రమం విస్తరించడానికి జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం ముఖ్య కారణమని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని సుమారు 250 పాఠశాలలకు విస్తరించి, కంప్యూటర్ ఆధారిత బోధన విధానాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలకు ఎఎక్స్, ఎల్ఎఐ ల్యాబ్ లను విస్తరించేందుకు జిల్లా కలెక్టర్ తో చర్చించి, వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపి సిఎస్ఆర్ నిధుల ద్వారా కంప్యూటర్లను అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎంపిక చేసిన పాఠశాలలకు మార్చి 6లోపు కంప్యూటర్లు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రానున్న రోజుల్లో అందరూ ఉపాధ్యాయులు ఎఐ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ఒకవేళ ఏఐ నేర్చుకోకుంటే మనందరం ఏఐలో నిరక్షరాస్యులుగామిగిలిపోయే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. ఈ సందర్భంగా ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థికి ఏఐ ఆధారిత విద్య ఎంతో అవసరమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా పేద విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తే బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని సిఎంఓ సుధాకర్ రెడ్డి సూచించారు. శిక్షణకు హాజరైనఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, గత సంవత్సరం నుండి ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా కార్యక్రమాన్ని మరింత విజయవంతంగానిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులు సాంకేతిక ఆధారిత బోధనలో మరింత నైపుణ్యం పొందుతారనిఅధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలుగా కె.నోమేశ్వర్ రెడ్డి, రాఘవేందర్, రవి, శ్వేత పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

ఎదిగేందుకు ఆస్కారం ఏర్పడిందన్నారు. ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నందున మహిళలు వివిధ వ్యాపారాలు, వృత్తులు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అభిలాషించారు. జిల్లాలో డయాబెటిస్ రోగులు పెరుగుతుండడంతో షుగర్, బీపీవంటి వ్యాధులు రాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాక ఎన్సీడీ స్క్రీనింగు, హెచ్.పి.వి వ్యాక్సిన్, తదితర కార్యక్రమాలునిర్వహిస్తున్నట్లు చెప్పారు. 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడాలి...ఎస్పీ....జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 99రోజులపాటు పది అంశాలను తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ థీమ్స్ ప్రతి కుటుంబంలో అందరి జీవితాలనుప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. మన ఆరోగ్యంతో పాటు పర్యావరణంలోని అన్ని జీవులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. రహదారి ప్రమాదాలతో ప్రతినిత్యం పదుల సంఖ్యలోమృత్యువాత పడుతున్నారని, దీనికి గల కారణాలను విశ్లేషించుకుని అవసరమైన నివారణ చర్యలు చేపడితే ఎన్నో కుటుంబాలకు మేలు చేసిన వారమవుతామన్నారు. డ్రగ్స్ నివారణకు ఈకార్యక్రమం ద్వారా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారి సంక్షేమానికి పోలీస్ శాఖ తరపునభరోసా కేంద్రాలు, షి టీమ్స్ ఏర్పాటుచేసి ముందుకెళ్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సూచించిన పది అంశాలు విజయవంతం కావాలంటే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరూ తమ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పలు మండలాల అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 12 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ పట్టణంలోని 18వ వార్డులో గల బస్తీదవాఖానలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్యక్రమం మరియు ఆరోగ్య పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా బస్తీదవాఖానల ద్వారా పేదలకు దగ్గరలోనే వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలు మరియు స్థానిక పౌరులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అలాగే బస్తీ దవాఖాన పరిసరాలలో పారిశుధ్యకార్యక్రమాన్ని నిర్వహించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదంరమేష్, కౌన్సిలర్లు సునీత శ్రీనివాస్‌గౌడ్, చంద్రకళ శ్రీనివాసులు అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులుమరియుస్థానికనాయకులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## ప్రజా పాలనలో భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శి షెడ్యూల్ వారీగా ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ప్రాంతాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమస్యలు ఎదురైతే జిల్లా పరిపాలన పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ ఖుష్బూ గుప్తా హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగస్వామ్యులై సహకారం అందించి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం మహాలక్షి పథకంలో భాగంగా ఆర్‌టిసి బస్సుల్లో మహిళఉచిత ప్రయాణం, ఎల్.పి.జి గ్యాస్ సిలిండర్ కు 500 రూ.లు సబ్సిడీ, గృహ జ్యోతి పథకం ద్వారా200 యూనిట్ ల లోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా శక్తి ద్వారా మహిళలసాధికారతకు వివిధ కార్యక్రమాలు, రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా5 లక్షల నుంచి 10 లక్షల రూ.లకు పెంచి వైద్య చికిత్స ,తదితర కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు.

**దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికను రూపొందించిందని అన్నారు. ఈ ప్రత్యేక కార్య క్రమం ద్వారాపట్టణాలు, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగు తుందని అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌గా 5 దశల్లో 10 ప్రాధాన్యత అంశాలతో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు. ఏప్రిల్2 గ్రామసభలు గ్రామస్థాయి కార్యక్రమాలుఏప్రిల్ 16మండల, మున్సిపల్ స్థాయి కార్యక్రమాలుమే 2 నియోజకవర్గస్థాయి కార్యక్రమాలుమే 22 జిల్లాస్థాయి కార్యక్రమాలుజూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను..ప్రజా ప్రతినిధులు, అధికారులు, అందరం అంకిత భావంతో పని చేసి విజయ వంతం చేద్దామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు. ప్రజాపాలనపట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం మరియు ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన, రాష్ట్ర అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో అందరం భాగ్యస్వాములై విజయవంతం చేద్దామని అన్నారు.

**జిల్లా ఎస్‌పి డి.జానకి మాట్లాడుతూ...** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్య క్రమంలో నిర్వహించిన శిక్షణ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు పైఅవగాహన కలుగుతుందని అన్నారు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్య క్రమం కూడా నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజా ప్రతినిధులకు ఒక శిక్షణ వంటిదని, ఈ కార్యక్రమంలో ప్రణాళిక ప్రకారం నిర్వహించిన కార్యక్రమాలు వచ్చే 5 సం.లు కూడా తమ పదవీ కాలంలో కార్య క్రమాలు సమర్థంగా అమలు చేయవచ్చని అన్నారు. పోలీస్ శాఖ ద్వారానో టు డ్రగ్స్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారుస్కూల్, పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కలిగించాలని, ఎక్కడైనావిద్యార్థులు డ్రగ్స్ వినియోగించిన, సర పరా జరిగినా పోలీసులకు ఫోన్, వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలి అన్నారు. వారి పేరు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. సురక్షితంగా చేరడం అనే కార్యక్రమం కూడా అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారినపడి అనేకమందిప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలతో వివరించారు.

**రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా పలు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను దశల వారీగా అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ ఒక రోజు శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం ప్రభుత్వం చేపట్టిన"ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)" ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లోని ప్రజలకు చేరవేయడమే లక్ష్యమని ఆయన చెప్పారు. ప్రజాప్రతినిధుల సహకారంతో రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్ తమతమ గ్రామ పంచాయతీ లను సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో ముందుకు తీసుకుపోయి, వారి గ్రామా లను, వార్డులను, ఆదర్శంగా నిలిపే విధంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పని చేస్తూ ప్రజలకు సేవ చేయాలని, తమపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.

**మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్ జి .మమత మాట్లాడుతూ...** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు తమ పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకునే గొప్పఅవకాశమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లి, వాటిని గ్రామీణ స్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా అమలు చేయుటకు పాటుపడాలని తెలిపారు. అదేవిధంగా, ఈకార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నరసింహా రెడ్డి కూడా మాట్లాడుతూ వారి విలువైన సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారులు, రిసోర్స్ పర్సన్స్ పిపిటి ప్రెజెంటేషన్ ద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల మీద శిక్షణలో హాజరైన ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ కూడా సర్పంచు లకు, కౌన్సిలర్లకు, కార్పొరేటర్లకు పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాల మీద అవగాహన కల్పించి వారి విధులు, బాధ్యతల గురించి వివరించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్ బి హరిప్రియ, ఆర్.డి.ఓ ఈ. నవీన్, ఇంచార్జ్ డిపిఓ జెడ్‌పి సిఇఓ వెంకట్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల్కోటి, దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ చైర్మన్‌గా డా. జె. రామ్మోహన్

**మహబూబ్‌నగర్ మార్చి12, ప్రభాతవార్త:** టిపిసిసి అనుబంధమైన డాక్టర్స్, మెడికల్, హెల్త్ విభాగం జిల్లా చైర్మన్ గా డాక్టర్ జె.రామ్మోహన్ నియమితులయ్యారు. టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్ డా. ఎం.రాజీవ్ నియామక పత్రం జారీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డా. రామ్మోహన్ కు డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్ల కొత్వాల్ నియామక పత్రం అందజేశారు. జిల్లాలో డాక్టర్స్, మెడికల్ సెల్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, రాజేందర్ రెడ్డి, సీజే బెనహర్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, లింగం నాయక్, డా. విజయ్ కాంత్, డా. రజనీకాంత్, డా. రాఘవేంద్ర, డా. రఘు సుప్రీత్, డాక్టర్ సంపత్ , మాజీ తహసిల్దార్ చెన్న కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుండాల ఆలయ అర్చకులు శివకుమార్ శర్మకు వార్షిక ప్రతిభ పురస్కారం

**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయ అర్చకులురాగిచెడు శివకుమార్ శర్మ శైవగామ విభాగంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు వార్షిక ప్రతిభ సత్కారము వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి ప్రధానాచార్యులు కుప్పశివ సుబ్రహ్మణ్య అవధాని గారిచే వార్షిక పండిత ప్రతిభా పురస్కారం శివకుమార్ శర్మ అందుకున్నారు. పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలి : దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, మార్చి 12 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టంగా చదివి పైకి ఎదగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. దేవరకద్ర మండలం, డోకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి శాలువాతో ఘనంగా సన్మానించిన నాయకులు, ఉపాధ్యాయ బృందం. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించి, చదువుతోపాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బలరాం, మున్సిపల్ చైర్మన్ దమయంతి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు, వచ్చిన సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, పిఏసిఎస్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, దేవరకద్ర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడవరకు కాంగ్రెస్‌తోనే

(మొదటి పేజీ తరువాయి)



విద్యుత్ అధికారుల సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

విశ్రమించకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణం కోసం గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టపరిచేందుకు అధిష్టానం నేడు ప్రత్యేక చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే నేడుగ్రామ కమిటీలు మండల కమిటీలు అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేస్తుందని, దీంతో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్లుగా , వైస్ చైర్మన్గా, కౌన్సిలర్లుగా, వార్డు సభ్యులుగా, సర్పంచులుగా, ఉపసర్పంచులుగా, ఎంపిటీసీలుగా, ఎంపీపీలుగా, ఇతరత్రా బాధ్యత లాంటి అనేక విభాగాల్లో పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందని ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చాక ఇల్లు లేని నిరుపేదలకు 5 లక్షల రూపాయల విలువలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, వనపర్తి పట్టణంలో 50 కోట్ల రూపాయలతో 33 వార్డుల్లో సీసీ రహదారుల నిర్మాణం, 70 కోట్ల రూపాయలతో కరెంట్ సమస్యల పరిష్కారం 70 కోట్ల రూపాయలతో అమృత్ స్కీం ద్వారా తాగునీటికి సంబంధించిన ఈ విధంగాపలుఅభివృద్ధి పనులను చేపట్యాం అన్నారు. వీటితోపాటు వనపర్తి నియోజకవర్గానికి రెండు మార్కెట్ యార్డ్ లు, 7సింగిల్ విండోలు మంజూరు చేయించి నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, టిపిసిసి జర్మన్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, ఓబిసి జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, వన పర్తి జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతియ్య, మైనార్టీ నాయకులు రహీం, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, మండల అధ్యక్షులు రవికిరణ్, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, వనపర్తి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యలే ప్రధానంగా గుర్తించండి :** తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా విద్యుత్ శాఖకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ బడ్జెట్ కేటాయిస్తోందని, అందులో వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టిసారించి ముందుకెళుతున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు. విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్, విద్యుత్ లైన్‌లో ఏర్పాటు, వనపర్తి పెబ్బేరు మున్సిపాలిటీలలో చేపట్టిన రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ లైన్ లో ఏర్పాట్లు వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలోనెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే తిని లు చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం తమ వద్దకు వచ్చే రైతులను గ్రామస్తులను నాయకులను అశ్రద్ధ చేయవద్దని వారి సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్న అధికారుల నిర్లక్ష్యం వలన చేసే పనిలోకి కూడా గుర్తింపు లేకుండా పోతుందని వారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు నిబద్ధతతో విధులు నిర్వహించాలని, నిరక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, విద్యుత్ శాఖ అధికారులు ఎస్‌ఈ తిరుపతయ్య, డిఇ శ్రీనివాస్, వెంకట శివరామ్, ఎడిఇ శ్రీనివాస్, శంకర్ రెడ్డి, వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రెండేళ్లలో వనపర్తి డిపోకి దాదాపు రూ.10 కోట్ల పైనే ఆదాయం...**

**నూతన బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ఆర్టీసీ పూర్తిగా దివాలా తీసి ఉండేదని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కోట్ల రూపాయల ఆదాయాన్ని గడిస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి డిపోకు వచ్చిన నాలుగు నూతన బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం వనపర్తి డిపోకే 15 పల్లె వెలుగు బస్సులు, 11 ఎక్స్‌ప్రెస్, 2 డీలక్స్ బస్సులు, 4 ఎలక్ట్రికల్ మొత్తం 32 కొత్త బస్సులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలోనే కేవలం వనపర్తి డిపోకే దాదాపు 10 కోట్లపైన ఆదాయం లభించిందని ఎమ్మెల్యే అన్నారు. వనపర్తి డిపోలో ప్రస్తుతం 118 బస్సులు ఉన్నాయని మరో 30 నుంచి 40 కొత్త బస్సులను డిపోకు తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి వారికి నెలకు 70000 ఆదాయం వచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నిజాం కాలంలో ఏర్పాటుచేసిన ఆర్టీసీ డిపో కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోఅభివృద్ధి చెందిందని ఆయనఅన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతిపల్లె మార్గానికి ఆర్టీసీ సర్వీసుల సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా ఉన్నామని ప్రతిగ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్లి వచ్చేలా చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, ఆర్టీసీ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని దివాలా తీయించిన ఘనత రేవంత్ రెడ్డిది!

- బకాయిలు చెల్లించడంలో జాప్యం ఎందుకు?
- ఆర్‌టిసికి రూ. 10 కోట్ల ఆదాయం ఎక్కడ?
- ఎమ్మెల్యే మీ ఊకదంపుడు ఉపన్యాసాలు పేపర్ ప్రకటనలకే బాగుంటున్నాయి
- బిఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న నందిమల్ల అశోక్

**వనపర్తి, మార్చి 12 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాములో ఆర్‌టిసి దివాళా తీసిందని ఎమ్మెల్యే మేఘరెడ్డి అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అని జిల్లా బిఆర్ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. నాలుగు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేటు యాజమాన్యంలోనివి వాటిని తాము సాధించామని చెప్పడం సిగ్గుచేటు. ఎలక్ట్రిక్ బస్సులతో కార్మికులను తగ్గించి ఆర్‌టిసి సంస్థను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అశోక్ ఆరోపించారు. కెసిఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌టిసి సంస్థను లాభాలబాటలో నడపారని, కెసిఆర్ ఉన్నపుడే కార్మికుల జీతాలు పెరిగాయని, ఆర్‌టిసి కార్మికులకు 64శాతం పిఆర్‌సిఇవ్వడం జరిగిందని, కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీన ప్రక్రియ దాదాపు పూర్తి చేయడం జరిగిందని అశోక్ అన్నారు. రేవంత్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్‌టిసి సంస్థను ప్రభుత్వంలో విలీన ఫైల్ మీద సంతకం పెడతానని చెప్పి రెండున్నర ఏండ్లు అయిన దిక్కులేదని అశోక్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే చెప్పినట్లు ఆర్‌టిసి లాభాల బాటలో ఉంటే కొత్త ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదనిఅశోక్ ప్రశ్నించారు. కార్మికులకు పనిభారం పెరిగి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు జరిగాయని అశోక్ గుర్తు చేశారు. 2014 నుండి 2018 వరకు ఎంత ఆదాయం ఆర్‌టిసి ఆర్జించిన విషయం రికార్డులలో ఉంటుందని వనపర్తి డిపోలో నెలకు సగటున 15 లక్షల ఆదాయంతో కోట్లరూపాయల లాభాలతో ఆర్‌టిసి నడిచిందని నందిమల్ల అశోక్ అన్నారు. నిజంగా ఆర్‌టిసి డిపో 10కోట్ల రూపాయల లాభాలతో నడుస్తుంటే రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు రావలసిన బెనిఫిట్స్ ప్రస్తుత ఉద్యోగులకు పిఆర్‌సి ఎందుకు ఇవ్వడం లేదని అశోక్ ప్రశ్నించారు. మహిళల భాగస్వామ్యం అనడం హాస్యాస్పదం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ముందడుగు వేయకపోగా ఇస్తామన్నప్రతి మహిళకు రూ. 2,500లు కూడా దిక్కులేదని అంతేకాకుండా ఆర్‌టిసి బస్సుల కొనుగోలులో మహిళల భాగస్వామ్యం అనడం హాస్యాస్పదం అని విమర్శించారు. ఆర్‌టిసి సంస్థను క్రమంగా ప్రైవేటు పరం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయ మాటలతో మభ్యపెట్టడానికి చేస్తున్న ప్రకటనలు మాత్రమేనని అశోక్ అన్నారు. ఈ సమావేశంలో యువత అధ్యక్షులు సూర్యవంశం, గిరి, నాయకులు ఎకే పాషా, అలీమ్ ఉన్నారు.

# ప్రజా పాలనతో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి

(మొదటి పేజీ తరువాయి)





అధికారులు శ్రద్ధ వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రజల్లో నిరంతరం ఉండడం వల్ల మంచి పేరుతో పాటు గుర్తింపు ఉన్నత స్థానాల్లో రాణించేందుకు ఇదొక అవకాశంగా తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు సూచించారు. అంతకుముందునాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టే 10అంశాల వారిగా నిర్వహించే ప్రతి అంశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏప్రిల్ 2 తేదీన గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి పది అంశాలను క్షుణ్ణంగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏప్రిల్ 16న మండల స్థాయి సమావేశాలు, మే 2న నియోజకవర్గస్థాయి, మే 22న జిల్లాస్థాయి, జూన్ 2న రాష్ట్రస్థాయిలో ప్రజా పాలన ప్రగతి నివేదికపై సమావేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అంశానికి ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందని, వారి జిల్లాలో గ్రామస్థాయిలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేస్తారని కలెక్టర్ తెలిపారు.



**అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ....** ప్రజా ప్రతి నిధులు తప్పనిసరిగా గ్రామాల్లోనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కా రానికి కృషిచేసి ప్రజలతో మంచిపేరు ప్రతిష్టలు పొందడంతో పాటు వ్యక్తి గతంగా గుర్తింపును పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మన నాగర్‌కర్నూల్ జిల్లా వాసి నల్లమల్ల ముద్దుబిడ్డ ఆశయాల కనుగుణంగా ప్రజాప్రతినిధులు అందరం కలిసి జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్దామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు.



**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ....** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల పాటు జరిగే కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతి నిధులకు ప్రజలకు మంచి సత్సంబంధాలు ఏర్పడి, ప్రజా ప్రతినిధులకు గ్రామాలకు గుర్తింపు తెస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఉంటూనే గ్రామ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా కల్వకుర్తి పట్టణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో 15 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ప్రజా ప్రతినిధులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను మరింతగా అభివృద్ధి పరచుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



**నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ...** ప్రజా ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాల మూడు మాసాల కాలం పూర్తి చేసుకుందని, ఇప్పటికే గ్రామాలు పట్టణాల్లో ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ సంక్షేమ పథకం లభించేదని, రానున్న 3 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం మరింత అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తుందని, ప్రజా ప్రతినిధులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సన్నద్ధం కావాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు వ్యవసాయం సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తుందని, ప్రజా ప్రతినిధుల భాగ్యస్వామ్యంతో గ్రామాలు వాటిలో మరింత అభివృద్ధి సాధిస్తాయని, అందుకు ప్రజా ప్రతినిధులు మరింతగా కృషి చేయాలని కోరారు. నాగర్ కర్నూల్ పట్టణానికి 55 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. భోజన అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సులో ప్రజా ప్రతినిధులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక 10 అంశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన శాఖల అధికారులు అవగాహన కల్పించారు. అంతకుముందు నాగర్ కర్నూల్, కల్వకుర్తి కొల్లాపూర్ మున్సిపల్ చైర్మన్, చైర్ పర్సన్ లు మాట్లాడి తమతమ అనుభవాలను వెల్లడించారు. తెలంగాణ సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాటల ద్వారా వినిపించి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, నాగర్ కర్నూల్ ఆర్టీవో సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్లు, నాగిరెడ్డి, అహమ్మద్ హుస్సేన్, మురళి, నాగర్‌కర్నూల్ తాహసిల్దార్ తబితారాణి, ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల జిల్లా స్థాయిఅధికారులు, మున్సిపల్ కమిషనర్లు ,ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శుభ్రతకు దుకాణదారులు సహకరించాలి

**వెల్దండ, మార్చి 12 ప్రభాతవార్త:** రోడ్లపై చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా దుకాణదారులు గ్రామ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ సూచించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిని సారించి సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న దుకాణదారుల వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రతగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరూ చెత్తను ఆరుబయట పడవేయకుండా గ్రామపంచాయతీ నుండి సమకూర్చిన ట్రాక్టర్లలోనే వేయాలని, శుభ్రత పాటించినట్లయితే రోగాలు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు రంగనాథం, రమేష్, వెంకటేష్, ఆనంద్, దేవేందర్, శేఖర్, రాజు, రవీందర్‌తో పాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పాపగల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ (తాడూరు), మార్చి12 ప్రభాతవార్త:** తాడూరు మండలంలోని పాపగల్ యూపీఎస్, ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కలెక్టర్‌గా సాదిక్, అదనపు కలెక్టర్‌గా శివ శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారిగా రామ్ చరణ్, డిప్యూటీ డిఈఓగా జాహిద్, ఎంఈఓగా సుమయ, ప్రధాన ఉపాధ్యాయురాలిగా అక్షిత వ్యవహరించి విద్యార్థులను, ఉపాధ్యాయులను మెప్పించారు. మొత్తం పాఠశాలలో 35 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

**వీరన్నపేటలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించిన డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి**



డ్రైనేజీని వాటర్ ట్యాంక్ ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

**మహబూబ్‌నగర్, మార్చి 12 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా, గురువారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్ (వీరన్నపేట) లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి పాల్గొని డివిజన్‌లోని పలు వీధుల్లో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వీరన్నపేటలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 99రోజుల ప్రణాళికలో భాగంగా వార్డుల్లోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి రోడ్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శివ రాజు, జ్యోతి, కుర్వసత్యం, కాంగ్రెస్ నాయకులు మైత్రి యాదయ్య, ఎన్. సుదర్శన్, కురువ నరేష్, చంద్రశేఖర్, రఘు మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## రంజాన్ ఐక్యతకు ప్రతీక

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి
- జడ్చర్లలో ఘనంగా ఇఫ్తార్ విందు హాజరైన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్ల కొత్వాల్





ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

**జడ్చర్ల, మార్చి 12 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని చంద్ర గార్డెన్లో జడ్చర్ల నియోజకవర్గం ముస్లిం మైనార్టీ సోదరుల కోసం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో గురువారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ మాసం ప్రాముఖ్యతను గుర్తు చేశారు. రంజాన్ పండుగ సౌహార్దం, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన నెల అని తెలిపారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, సోదరభావంతో కలిసి జీవించాలి అని అన్నారు. అలాగే పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## వీపనగండ్ల గ్రామ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకుపోయిన సర్పంచ్

**వీపనగండ్ల మార్చి 12, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపై గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు గురువారం నాడు వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి కి ఆమె వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ప్రధానంగా మండల కేంద్రంలో ప్రజలకు రవాణా సౌకర్యం రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ఇబ్బందికరంగా ఉందని దానితోపాటు మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం నూతన భవనాన్ని కి నిధులు మంజూరు చేయించాలని దానితోపాటు నూతన గ్రామ పంచాయతీకి స్థలం కేటాయించే విధంగా అధికారుల దృష్టికి తీసుకుపోవాలని తదితర అంశాలను ఆమె మంత్రి దృష్టికి తీసుకువచ్చారు అదే విధంగా 721 సర్వేనెంబర్ సంబంధించి అన్యాక్రాంతమైనటువంటిభూములను కూడావివిధ వ్యక్తుల ఆక్రమణంలో ఉన్న భూమిని విడిపించాలని ఆమె మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు అదేవిధంగా క్రీడలకు సంబంధించి ప్లే గ్రౌండ్ ఫంక్షన్ హాల్ మంజూరు చేయాలని ఈ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు

## ఉరి వేసుకుని వలస కూలీ మృతి

**కృష్ణ, మార్చి 12 ప్రభాతవార్త:** మహారాష్ట్ర వాసి, వలస కూలీ రంజిత్ వైద్యనాథ్ మస్కే (20) అనే వ్యక్తి ఉరి వేసుకునే మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. రంజిత్ హిందూపూర్ లో గల ఎస్ఎన్ ఇటుక బట్టిలో పనిచేసేవాడు. ఇంట్లో గొడవ పడి మద్యం తాగిన మత్తులోఅర్ధ రాత్రి క్షణికావేశంలో ఉరివేసుకొని చనిపోయాడు .మృతుడి తండ్రి వైద్యనాథ్ శ్రీపతి మస్కే ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు.